# జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే శాపం

**మాకు న్యాయం చేయండి : జనప్రియనగర్ వాసులు**

**సెట్ బ్యాక్‌లను నిర్ణయించి మార్కింగ్ చేసి ఇవ్వండని అధికారులను కోరిన ఫేజ్-5 ప్లాట్ యాజమానులు**



జనప్రియ నగర్ ఫేజ్-5లో నిరసన దీక్ష చేస్తున్న స్థానిక ప్లాట్ యాజమానులు



నిర్మాణం చేసేందుకు ఫేజ్-5 వాసులు ఏర్పాటు చేసుకున్న గోడను కూల్చిన అంబేద్కర్ నగర్ ప్లాట్ యజమాని

మాదాపూర్, మే 8: లేఅవుట్‌లో ఏదైనా నిర్మాణాలు చేపట్టే ముందు జీహెచ్‌ఎంసీ అధికారులు అన్ని విధాల పరిశీలించి అనుమతులు ఇవ్వాలి. కానీ మియాపూర్ జనప్రియ నగర్ ఫేస్- 5లో కాలనీవాసులు సెట్ బ్యాక్ స్థలంలో రాకపోకలు సాగించడానికి 2002 లో ఎమ్మెల్యే నిధులతో రోడ్డును వేయించుకున్నారు. అదే కాలనీకి ఆనుకొని ఉన్న అంబేద్కర్‌నగర్ కాలనీవాసులు నిర్మాణాలు చేపట్టేందుకు జనప్రియనగర్ ఫేస్-5 ప్లాట్ ఓనర్ లు ఏర్పాటు చేసుకున్న రహదారిని రోడ్డుగా చూపి జీహెచ్‌ఎంసీ నుంచి అనుమతులు తీసుకొని అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఆనాడు జనప్రియనగర్ ఫేజ్-5కి ఇచ్చిన అధికారులు ఈనాడు అదే రోడ్డును చూపెడితే అనుమతులు ఎలా ఇచ్చారని జనప్రియనగర్ వాసులు జీహెచ్‌ఎంసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం జనప్రియ నగర్‌లో జనప్రియనగర్ ఫేజ్-5 ప్లాట్ యాజమానులు శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం, చందానగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్యాన్నీ ఎత్తిచూపుతూ నిరసన దీక్ష చేపట్టారు. మియాపూర్ జనప్రియనగర్ ఫేజ్-5లో సర్వే నంబర్ 47, 48, 49 (మియాపూర్ విలేజ్), 34 హఫీజ్ పెట్ విలేజ్ పరిధికి వస్తాయి. ఈ సర్వే నంబర్ లకు సంబంధించి జనప్రియనగర్ ఫేజ్-5లో మొత్తం 4.09 ఎకరాల స్థలం ఉండగా.. అక్కడ లే అవుట్ ప్రకారం.. 650 ప్లాట్‌లు, 10 బ్లాక్‌లు ఉన్నాయి. అంబేద్కర్‌నగర్ కాలనీలో 60, 80, 100, 120 గజాల స్థలం లో ఇండివిజల్ ప్లాట్‌ల నిర్మాణం చేసుకున్నారు. ఇందులో అసోసియేషన్‌తో పని లేకుండా ఇష్టారాజ్యంగా ఎవరికి వారే పెత్తనం చెలాయిస్తూ జీహెచ్‌ఎంసీ అధికారులకు ముడుపులు ముట్ట చెబుతూ నిర్మాణాలు చేసుకుంటున్నట్లు ఫేజ్-5 ప్లాట్ యాజమానులు ఆరోపిస్తున్నారు.


**జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే కారణం**

అంబేద్కర్‌నగర్ కాలనీ వాసులు ఫేజ్-5కి చెందిన రోడ్డును చూపి నిర్మాణాలకు అనుమతులు తీసుకున్నారు. చందానగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు తమ చేతి వాటం ప్రదర్శించి ఎటువంటి ఎంక్వైరీ చేయకుండానే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారు. అధికారులు నిజా నిజాలు పరిశీలించకుండానే అనుమతులు ఎలా ఇస్తారని ఫేజ్ -5 ప్లాట్ యాజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనప్రియ నగర్ ఫేజ్-5కి చెందిన స్థలంలో ఏర్పాటు చేసిన ప్రహరీ గోడను కూల్చి అంబేద్కర్ నగర్ కాలనీ వాసులు అక్రమంగా గేట్ లను ఏర్పాటు చేసుకున్నట్లు వాపోతున్నారు. ఇదంతా జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యమేనని, అంబేద్కర్ నగర్ వాసులు అధికారులకు చేతులు తడపడం తోనే వారికి అధికారులు సైతం వత్తాసు పలుకుతూ ఎటువంటి సర్వే చేయకుండా నిర్లక్షంతో అనుమతులు ఇచ్చారని చెబుతున్నారు.

**రెండేండ్లుగా ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు..**

అంబేద్కర్‌నగర్, జనప్రియనగర్ ఫేజ్- 5 వాసుల మధ్య రోజు రోజుకు ఈ విషయంపై వివాదం ముదురుతోంది. గత రెండేండ్లుగా స్థానిక జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకునే నాధుడు కరువయ్యాడని ఫేజ్ -5 వాసులు అంటున్నారు. న్యాయం చేయాల్సిన అధికారులే తమకు అన్యాయం చేస్తే మా గోడు వినేదెవరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి ఎంక్వైరీ చేయకుండా ఫేజ్ 5కి చెందిన స్థలంలో అంబేద్కర్ నగర్ వాసులకు సెట్ బ్యాక్ స్థలాన్ని రోడ్డు కింద ఎలా నిర్ణయిస్తారని కాలనీ వాసులు మండిపడుతున్నారు. న్యాయం జరిగే వరకు నిరసన దీక్షను విరమించేది లేదని ఫేజ్-5 వాసులు అంటున్నారు. తాజాగా ఫేజ్ -5 కి చెందిన ప్రహరీ గోడను కూల్చి అంబేద్కర్‌నగర్ వాసులు నిర్మాణం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా మాకు సెట్ బ్యాక్ లను చూపించి మార్కింగ్ ఇస్తే దాని ప్రకారం ప్రహరీ గోడ నిర్మాణం చేసుకుంటామని కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వి.జగదీశ్వర్‌గౌడ్ బాధితులకు సంఘీభావం తెలిపారు. అనంతరం సంబంధిత అధికారులకు ఫోన్ చేసి బాధితులకు ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇదిలా ఉండగా జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడకు చేరుకొని ఫేజ్ -5 యాజమానులు నడిచేందుకు రోడ్డు లేకపోవడంతో ఫేజ్ -5 వాసులు ఏర్పాటు చేసుకున్న రోడ్డు దిశగా ఫేజ్ -5 బాధితులు ఏర్పాటు చేసుకున్న ప్రహరీని కూల్చి వాటికి గేట్‌లను ఏర్పాటుచేసుకున్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది అక్కడకు చేరుకొని కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు గేట్‌లను తొలగించారు. ఈ నిరసన దీక్షలో జనప్రియ నగర్ ఫేజ్-5కి చెందిన కాశి విశ్వనాథ్, రవి కుమారు, శేఖర్ రెడ్డి, వర్మ కిషన్‌రావు, రంజిత్ రెడ్డి, రామాంజనేయులు, జ్యోతిరెడ్డి, సత్య లక్ష్మి తదితరులు ఉన్నారు.

## యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే కృష్ణారావు పూజలు



యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం దేవాలయ ప్రాంగణంలో మనవడి అన్నప్రాసన పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకోగా.. వేద పండితులు కుటుంబసభ్యులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో కుమారుడు సందీప్ రావు దంపతులు, తులసీరావు దంపతులు, కుటుంబసభ్యులు ఉన్నారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, మే 8

## ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం



కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని శ్రీ ఉమారామలింగేశ్వరస్వామి దేవాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం ప్రత్యేక హోమ పూజలతోపాటు ఉమారామలింగేశ్వరస్వామి శాంతి కల్యాణం కనులపండుగగా జరిగాయి. ఈ వేడుకలలో కేపీహెచ్‌బీ కాలనీ కార్పొరేటర్ మందాడి శ్రీనివాసరావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉమా రామ లింగేశ్వర స్వామి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలని పూజించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, మే 8

## తాగునీటి సమస్యను పరిష్కరించండి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గాయత్రినగర్ సంఘం కార్యవర్గ సభ్యులు

అల్లాపూర్, మే 8: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రినగర్‌లో లోప్రెషర్‌తో సరిపడా తాగునీరు సరఫరా కావడంలేదని ఆ కాలనీ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులు గురువారం వార్డు కార్యాలయానికి వచ్చి కార్పొరేటర్ సబిహా బేగం వద్ద తమ గోడును వెలిబుచ్చారు. ఎండల తీవ్రతతో ఒకవైపు భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, మరోవైపు లోప్రెషర్‌తో 20 నుంచి 30 నిమిషాలు మాత్రమే తాగునీరు సరఫరా చేస్తున్నారన్నారన్నారు. దీంతో వేల రూపాయలు వెచ్చించి వాటర్‌క్యాన్లు కొనాల్సిన పరిస్థితి వచ్చిందని మహిళలు వాపోయారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గంటకుపైగా తాగునీరు సరఫరా అయ్యేదని, మాయదారి కాంగ్రెస్ పాలనలో నల్ల ఎప్పుడు వస్తుందో కళ్లలో ఒత్తులు వేసుకొని చూడాల్సిన పరిస్థితి దాపురించిందని మండిపడుతున్నారు. గాయత్రినగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కార్పొరేటర్‌ను అభ్యర్థించారు. వారి సమస్య విన్న కార్పొరేటర్ స్పందించి జల మండలి అధికారులకు ఫోన్ చేసి గాయత్రినగర్‌తోపాటు ఇతర కాలనీల్లో తాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కృష్ణారావు, సభ్యులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

## కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కోర్సుల ప్రవేశాలకు ఆహ్వానం

కేపీహెచ్‌బీ కాలనీ, మే 8: కూకట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులచే.. నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని, ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ అలివేలు మంగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం తెలంగాణ దోస్త్ నోటిఫికేషన్ విడుదలైందని, ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, బీఏ, బీకాం కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు... కూకట్‌పల్లి డిగ్రీ కళాశాలలో కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. మరిన్ని వివరాలకు విద్యార్థులు అడ్మిషన్ కోఆర్డినేటర్ సాయి కొండలు, టెక్నికల్ కోఆర్డినేటర్ నాగార్జున లను సంప్రదించాలని కోరారు.

## చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్, మే 8: గుర్తు తెలియని వ్యక్తి గాంధీ అస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం...ఈనెల 2న మైసమ్మ గూడ చర్మాస్‌రోడ్డులో సుమారు 50 నుంచి 60ఏండ్ల వ్యక్తి అపస్మారక స్థితిలో ఉన్నాడని 100కు వచ్చిన సమాచారం మేరకు సంఘటన స్థలానికి చేరుకొని వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 5న మృతి చెందినట్లు అక్కడి వైద్యులు నిర్ధారించారు. మృతుడు ఎరుపు, నలుపు గీతాల షర్ట్, యాష్ కలర్ ప్యాంట్ ధరించి వున్నాడని ఆచూకీ తెలిసిన వారు పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

## కుర్మ సంఘం ఏకగ్రీవ ఎన్నిక

ఘట్‌కేసర్, మే 8:ఘట్‌కేసర్ కుర్మ సంఘం అధ్యక్షుడిగా దయ్యాల లింగయ్య కుర్మ ఏకగ్రీవంగా ఎన్నిక అయినట్లు ఆ సంఘం ఉపాధ్యక్షుడు బిట్కూరి మహేందర్ కుర్మ తెలిపారు. ఘట్‌కేసర్ పట్టణంలో జరిగిన కుర్మ సంఘం సమావేశం అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. ఈ ఎన్నికలో అధ్యక్షుడిగా లింగయ్య కుర్మ, ఉపాధ్యక్షులుగా బీట్కూరి మహేందర్ కుర్మ, వెంకటేశ్, ప్రధాన కార్యదర్శిగా మిరియాల సతీశ్, సహాయ కార్యదర్శులుగా కరుణాకర్, కిశోర్, సుధాకర్, నవీన్, మహేశ్, సలహాదారులుగా చిన్న శ్రీశైలం, గట్టయ్య, శంకర్, బీరయ్య, నర్సింహ, గండయ్య, అంజయ్య, కుమార్, భరత్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కురుమ సంఘం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

## కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 8: కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో గురువారం కూరగాయల ధరలు (కేజీ-రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 13, వంకాయ 18, బెండకాయ 41, పచ్చిమిర్చి 35, బజ్జి మిర్చి 35, కాకరకాయ 40, బీరకాయ 45, క్యాబేజి 10, ఫ్రెంచ్ బీన్స్ 115, క్యారెట్ 21, కాలీఫ్లవర్ 23, దొండ 21, చిక్కుడు 55, గోరుచిక్కుడు 40, బీట్‌రూట్ 19, క్యాప్సికం 45, ఆలుగడ్డ 25, కీర 23, దోసకాయ 18, సొరకాయ 12, పొట్లకాయ 18, కందగడ్డ 85, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 18గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం



క్యాంప్ ఆఫీసులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 8: అనారోగ్యంతో వైద్యశాలలో చేరిన పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతగానో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని మోతినగర్‌కు చెందిన విత్తనాల శ్రీనివాస్ రూ.2.25 లక్షలు, మూసాపేటకు చెందిన ముదావత్ చిన్మయికి రూ.50వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కష్టకాలంలో ఉన్న పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ నేతలు ఉన్నారు.

## శ్మశాన వాటికల అభివృద్ధికి కృషి



ఫిరోజ్గూడలో శ్మశాల వాటిక అభివృద్ధికి కృషి చేస్తానని బాలానగర్ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలనగర్ డివిజన్ పరిధిలోని ఫిరోజ్‌గూడ లో రూ.50లక్షల నిధులతో శ్మశానవాటిక పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాలానగర్ డివిజన్ ఫిరోజ్గూడలోని శ్మశానవాటిక అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి పనులకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఏఆశ నాయకులు వెంకటేశ్, రవీందర్, ఎడ్ల సదానంద్, ఎడ్ల ప్రభాకర్, యాదయ్య, కృష్ణ, పాశం కృష్ణ యాదవ్, సత్యనారాయణ, ఎడ్ల సత్యనారాయణ, పాల్గొన్నారు. – బాలానగర్, మే 8

## పవర్ లిఫ్టింగ్ విజేతలకు సన్మానం



బాలానగర్, మే 8 : పవర్ లిఫ్టింగ్ పోటీలలో విజేతలను ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. గురువారం ఫతేనగర్ భగత్ సింగ్ పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను ఆయన ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సత్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. యువత క్రీడల పట్ల ఆసక్తి కనబరచాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కోచ్ ఆనంద్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## ఎంఫార్మసీ పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను వచ్చే నెల 4వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## పలు కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లమో ఇన్ ఎర్లీ ఇంటర్వెన్షన్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలతో పాటు ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ కోర్సు సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నాం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు శంభీపూర్ కృష్ణ

దుండిగల్, మే 8: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నేత, దుండిగల్ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. గురువారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ సంక్షేమ సంఘాల సభ్యులు శంభీపూర్‌లోని ఆయన కార్యాలయంలో శంభీపూర్ కృష్ణను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి, వారి ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించి ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే కె.పి.వివేకానంద దృష్టికి తీసుకెళ్లి వారి సహాయ సహకారాలతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. అదే విధంగా పలు ప్రాంతాల్లో జరగబోయే వివిధ శుభకార్యాల వేడుకల్లో, వివాహ వేడుకల్లో పాల్గొనాలని పలువురు ఆయనకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్‌ఆఫ్ చెక్కులు పంపిణీ

దుండిగల్, మే 8: పేద మధ్యతరగతి ప్రజలకు సీఎంసహాయనిధి పథకం కొండంత అండగా మారిందని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారంలోని ఆయన పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఇటీవల అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన చౌదరిగారి కృష్ణవేణి కి రూ.49వేలు, వెలుగలా పుష్పమ్మకు రూ.60వేలు, ఈరప్ప పంచల్ రూ.60వేలు, పల్లపు రేణుక రూ.60వేల విలువజేసే సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజలు, సంక్షేమ సంఘాల నాయకులు, మహిళా సంఘాలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వేర్వేరు ప్రాంతాల్లో బాలుడు, వృద్ధుడు అదృశ్యం



అమినుద్దిన్(ఫైల్)



సయ్యద్ వలి(ఫైల్)

దుండిగల్, మే 8: వాష్‌రూమ్‌కి వెళ్లి వస్తానంటూ బయటికి వెళ్లిన ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం... గాజుల రామారం, భవానినగర్‌లోని భరత్ ఫంక్షన్ హాల్ సమీపంలో నివాసముంటున్న మహమ్మద్ నూరుద్దీన్ దేవేందర్‌నగర్‌లో సెల్ ఫోన్ల విక్రయం షాపును నిర్వహిస్తున్నాడు. అందులో అతనితోపాటు అతడి కొడుకు మహ్మద్ అమీనుద్దీన్(14) పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 6వ తేదీన ఉదయం 10:30 గంటల సమయంలో వాష్‌రూమ్‌కి వెళ్లి వస్తానంటూ షాపు నుంచి బయటికి వెళ్లిన అమీనుద్దీన్ రాత్రి పొద్దుపోతున్నా తిరిగి రాలేదు. అటు షాపుకి రాక ఇటు ఇంటికి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు అతడి కోసం వెతకగా ఎటువంటి ప్రయోజనం లభించలేదు. దీంతో నూరుద్దీన్ గురువారం సూరారం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో వృద్ధుడు..**

సూరారం డివిజన్, వైష్ణవినగర్‌లో నివాసముంటున్న సయ్యద్ వలి(65)ఈనెల 7వ తేదీన సాయంత్రం 5:30 గంటల సమయంలో ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లి రాత్రి వరకకు తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళనకు గురైన కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతకడంతోపాటు బంధువుల ఇండ్లలోను ఆరా తీశారు. అయినప్పటికీ ఎటువంటి ఫలితం దక్కకపోవడంతో గురువారం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## డిసేబులిటీస్‌లో ప్రవేశాలకు ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని అలీ యావర్ జంగ్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్పీచ్ అండ్ హియరింగ్ డిసేబులిటీస్‌లో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ కేంద్రం 2025-26 విద్యా సంవత్సరానికి బీఏఎస్ఎల్పీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (హెచ్ఐ), ఎంఎస్సీ(ఆడియాలజీ) కోర్సులతోపాటు డిప్లొమా స్థాయి కోర్సులను సైతం అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కోర్సుల్లో చేరేందుకు వచ్చేనెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రవేశాలను ప్రవేశపరీక్షలో ప్రతిభ ఆధారంగా నిర్వహిస్తామని వివరించారు. వివరాలకు www.ayjnishd.nic.inలో చూసుకోవాలన్నారు.

## ఎంపీఈడీ పరీక్ష పత్రాల నకలకు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని ఎంపీఈడీ పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీఈడీ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపరు రూ.1,000 చొప్పున చెల్లించి వచ్చే నెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## ఏఈఈ సాయిప్రసాద్‌కు సన్మానం



మూసాపేట సర్కిల్ కేపీహెచ్‌బీ కాలనీ ఏఈఈ గాదే సాయి ప్రసాద్‌ను కేపీహెచ్‌బీ కాలనీ రమ్యగ్రౌండ్ మిత్ర బృందం సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. గురువారం వార్డు కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీర్(ఏఈఈ)గా ఏడేండ్లుగా సేవలందించి ఇటీవల హెచ్‌ఎండీఏకు బదిలీ అయినా సందర్భంగా ప్రత్యేకంగా సన్మానించారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించడం, అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావడం, ఎవరిని నొప్పించకుండా విధులను నిర్వర్తించారని కొనియాడారు. అలాగే కాలనీలో రోడ్లు పార్కులు, శ్మశానవాటికలు, కమ్యూనిటీ హాళ్లను నిర్మించడానికి చేసిన కృషికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కట్ట నరసింహ రావు, సాంబశివరావు, రావెళ్ల హరిబాబు, కోల్ల శంకర్, రామకృష్ణ, వెంకట సుబ్రహ్మణ్యేశ్వరరావు, శ్రీనివాసరావు, మురళి, రవి, వెంకటరమణ తదితరులు ఉన్నారు.
– కేపీహెచ్‌బీ కాలనీ, మే 8

## చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బాలనగర్ డీసీపీ సురేశ్‌కుమార్

మూసాపేట, మే 8: సైబరాబాద్ కమిషనర్ ఆదేశాల మేరకు వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని బాలనగర్ జోన్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌ల వద్ద తాగునీటి అవసరాలను తీర్చేందుకు పోలీస్‌శాఖ ఎన్‌జీవోల సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు బాలానాగర్ డీసీపీ సురేశ్‌కుమార్ తెలిపారు. ఎండలు మండుతున్న ప్రస్తుత తరుణంలో వాహనదారులు పాదచారుల దాహార్తిని తీర్చేందుకు స్వచ్ఛవేద ఫౌండేషన్ ఫౌండర్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కూకట్పల్లిలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం డీసీపీ సురేశ్‌కుమార్ కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, సీఐ రాజేశ్‌లతో కలిసి ప్రారంభించారు.

## అట్టహాసంగా సాగిన ఫ్యాషన్ షో

మాదాపూర్, మే 8: మోడల్స్ సంప్రదాయమైన దుస్తులతో ర్యాంప్‌పై క్యాట్‌వాక్ చేసి సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో యువతరాన్ని ఉర్రూతలూగించే షీక్ ఫ్యాషన్‌షోను గురువారం ఫ్యాషన్ మేడ్ ఫ్యాబులస్ ట్యాగ్ లైన్‌తో ఘనంగా నిర్వహించారు. ఇందులో ఆధునిక తరం కొరకు స్ట్రీట్ వేర్‌ను తిరిగి తీసుకురావాలనే ఉద్దేశంతో వ్యక్తిత్వాన్ని వెలికితీసే స్టైలింగ్ నుంకలగలిపిన రీతిలో హైదరాబాద్ ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. షీక్ ఫ్యాషన్‌షోలో సంప్రదాయమైన దుస్తులు, స్వీయ వ్యక్తీకరణను ప్రేరేపిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించే రీతిలో కొనసాగింది.



